తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుచానూరు, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:



తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. 4వ తేదీ వసంతోత్సవాలు అంకురార్పణంతో ప్రారంభమై ఐదవ తారీకు నుండి 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయశుద్ధి కార్యక్రమంలో భాగంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. అమ్మ వారిని సుప్రభాతంతో మేలుకొలుపు సహస్రనామార్చన నిత్య అర్చన నిర్వహించారు. అనంతరం వివిధ సుగంధ పరిమళాలతో కలగలిపిన మిశ్రమాన్ని పవిత్రజలంతో కలిపి ఆలయంలోని అన్ని ప్రాంతాలలో ప్రోక్షణం చేపట్టారు. డిప్యూటీ ఈఓ హరింద్రనాథ్, ఆలయ అర్చకులు బాబు స్వామి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు చలపతి, సుబ్బరాయుడు ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## బ్యానర్లు కడుతూ విద్యుత్ షాక్ గురై ఒకరు మృతి

చిత్తూరు, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:



చిత్తూరు ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ ప్రక్కన రోడ్డుపై బుధవారం జరుగనున్న చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార బ్యానర్లు కడుతూ విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో ఒక వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు గాయపడిన సంఘటన చిత్తూరులో జరిగింది. చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం బుధవారం బాధ్యతలు తీసుకోనుంది. ఈ బాధ్యతలు తీసుకునే సందర్భంగా పాలక కమిటీ సభ్యులు మార్కెట్ కమిటీ పరిసరాల్లో పెద్ద ఎత్తున బ్యానర్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నారు. ఈ బ్యానర్లను ఏర్పాటు చేయడానికి వచ్చిన ఆనంద్(19) హోర్డింగ్ కడ్తుండగా ప్రమాదవశాత్తు పైన వెళ్తున్న విద్యుత్ తీగకు తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయాడు. అలాగే ఈ ఘటనలో మరో ఇద్దరు వ్యక్తులు విద్యుత్‌షాక్‌కు గురై కింద పడిపోవడంతో ఆనంద్‌తో పాటు మరో ఇద్దరు యువకులను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆనంద్ మృతి చెందారని డాక్టర్లు పేర్కొన్నారు, ఈ ఘటనలో గాయపడిన మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ తెలిపారు.

# గజవాహనంపై గజాననుడు



కాణిపాకం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి విఘ్న నాయకుడైన గణనాధుడు ఉభయదేవేరులతో కలసి గజవాహనంపై కాణిపాకం పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి గజవాహనసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం వన్నియర్ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉభయదారులు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేకంగా పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అనంతరం శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలతో ధూపదీనైవేద్యాలను సమర్పించారు. అలాగే సాయంత్రం యాగశాలలో యాగమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. తిరిగి రాత్రి అలంకార మండపంలో వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చస్వాముల పూజలందుకున్న సిద్ధి, బుద్ధి సమేత గణనాధుడు రంగు రంగుల విద్యుద్ధీపాలు, వివిధ రకాల పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించిన గజవాహనంపై అధిరోహించి మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్,డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓ రవీంద్రబాబు, ఆలయ సూపరెండెంట్‌లు వాసు,కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబు లతో పాటు ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## రథోత్సవానికి భారీ ఏర్పాట్లు: ఆలయ ఈఓ





కాణిపాకం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలో భాగంగా బుధవారం జరుగనున్న రథోత్సవంకు భారీ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు.మంగళవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ కాణిపాకం దేవస్థానంలో బుధవారం రథోత్సవంను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా భక్తులందరికి త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించేందుకు ఆలయంలో వేర్వేరుగా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనితో పాటు ప్రధాన ఆలయంలో వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకాలంకరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం ఉభయదారులచే రథంకు ప్రత్యేకపూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరిగి స్వామివారి రథోత్సవం మధ్యాహ్నం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రథోత్సవం సందర్భంగా తరలివచ్చే భక్తులకు అన్నదాన భవన్‌లో ఉదయం నుండి రాత్రి వరకు ఉచిత బోజనవసతి నిరంతరాయంగా కల్పిస్తున్నట్లు తెలిపారు.

# గుత్తివారిపల్లిలో అతిసార

## 16 మంది ఆసుపత్రి పాలు



వ్యాధిగ్రస్తులను విచారిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

రేణిగుంట సెప్టెంబర్ 2 ప్రభాతవార్త

రేణిగుంట మండలం గుత్తి వారి పల్లె గ్రామంలో అతిసార (డయేరియా) వ్యాధి ప్రబలి దాదాపు 16మంది వ్యాధిగ్రస్తులు రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని శ్రీ బాలాజీ మెడికల్ కాలేజీ ఆసుపత్రి నందు మంగళవారం చికిత్స పొందుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆసుపత్రిలో వ్యాధిగ్రస్తులను పరామర్శించి వైద్యుల ద్వారా వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. గుత్తి వారి పల్లి గ్రామంలో ఒక్కసారిగా 18 మందికి అతిసార ( వాంతులు, బేదులు) సోకి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. రేణిగుంట మండల వైద్యాధికారి చక్రపాణి గుత్తి వారి పల్లె గ్రామం సందర్శించి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. మెడికల్ క్యాంపులో ముగ్గురు చికిత్స పొందుతుండగా, 16 మందిని గ్రామస్తులు సమీపంలోని శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల ఆసుపత్రికి తీసుకెళ్లారు. శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల ఆసుపత్రి నందు వైద్యులు డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ సాయి కార్తీక్, డాక్టర్ లహరి వైద్య బృందం వ్యాధిగ్రస్తులకు సత్వరం వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడుతూ నిలకడగా ఉన్నాయని వైద్య బృందం తెలిపారు. విషయం తెలిసిన వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, రేణిగుంట తహసిల్దార్ ఆసుపత్రి వెళ్ళి వ్యాధిగ్రస్తులను పరిశీలించి వారికి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా డాక్టర్లను కోరారు. వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు గుత్తి వారి పల్లె గ్రామంలో మెడికల్ క్యాంపును కొనసాగించడమే కాకుండా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలని మండల వైద్య శాఖ అధికారులను, సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఆదేశించారు.

### మెరుగైన వైద్యసేవలకు

# అందుబాటులో అంబులెన్స్‌లు

### - కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు

చిత్తూరు, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:



చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవడానికి వచ్చే రోగులకు మెరుగైన అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి పక్కాగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు పేర్కొన్నారు. చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుత్రిలో మంగళవారం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు కొత్త అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పాత అంబులెన్స్ స్థానంలో కొత్త అంబులెన్స్‌లను తీసుకువచ్చి ప్రజలకు అత్యవసర సేవలు అందించడం జరుగుతుంద న్నారు. ఐఓసిఎల్ ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద త్వరలో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి మరొక కొత్త అంబులెన్స్ రానుందని, దీంతో ఆసుపత్రిలో అంబులెన్స్‌ల సంఖ్య మూడుకు చేరనుం దన్నారు. అత్యవసర వైద్య చికిత్స, రెఫరల్‌ల కోసం వేలూరు, తిరుపతిలోని ఆసుపత్రులకు రోగులను సరైన సమయంలో తీసుకెళ్ళడానికి అంబులెన్స్‌లు ఉపయోగకరంగా వుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజ సింహులు, దక్షిణాది రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జ్ పి.షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృత వర్సిటీలో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు

తిరుపతి విద్య, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:



జాతీయ సంస్కృత వర్సిటీలో మంగళవారం సాంకేతికత ద్వారా విద్యావ్యవస్థ సశక్తీకరణం, శిక్షా క్షేత్రంలో నూతన సాంకేతిక విధానాలు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు ఘనంగా ఆరంభమైంది. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని చెలి కాని అన్నమాచార్య సభాభవనంలో సంగ్రహంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ ప్రొఫెసర్లు, అంతర్జాతీయ పండితులు,అధ్యాపక వర్గం,పరిశోధకులు, విద్యార్థులు విశిష్టంగా హాజరయ్యారు.ఈ సదస్సు లక్ష్యాలను ఎడ్యుకేషన్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ పి.వెంకటరావు వివరించగా,ప్రధాన విషయ పరిచయాన్ని విశ్వవిద్యాలయ ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ రాధా గోవింద త్రిపాఠి అందించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొ. రాణి సదాశివమూర్తి, శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్, తన ప్రసంగంలో సంస్కృత భాషను ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చేయడానికి ఇది సమర్థవంతమైన మార్గమని నొక్కిచెప్పారు. అంతర్జాతీయ పండితులు డా. హెచ్. లూసీ గెస్ట్ (ఇంగ్లాండ్), శ్రీ కృష్ణకీర్తి ప్రభు (అమె రికా), ప్రొ. టికరామ్ న్యౌపానే మరియు డా. నవరాజ్ కాట్లే (నేపాల్) లు సంస్కృతం విశ్వజ్ఞానం, తత్త్వ శాస్త్రం, విజ్ఞానం, ఆధ్యాత్మికతకు అనుతోపమైన భాష అని వివరించారు. వైస్ చాన్సలర్ ప్రొ. జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృతాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో సాంప్రదాయ పాండిత్యాన్ని ఆధునిక సాంకేతికతతో సమన్వయం చేసేందుకు కృషి చేస్తున్నదని పేర్కొన్నారు.

# సంఘాల మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

### - సంఘాల సభ్యులకు 'మన డబ్బులు-మన లెక్కలు' మొబైల్ యాప్ -సెర్ఫ్ సిఇఓ వాకాటి కరుణ

తిరుపతిరూరల్,సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:



వెలుగు సంఘాల మహిళలు వ్యాపార వేత్తలు ఎదగాలని సెర్ఫ్ ముఖ్యకార్యనిర్వాహణాధికారి వాకాటి కరుణ కోరారు. రాష్ట్రంలో మొదటిసారిగా సంఘ సభ్యురాలి పొదుపులు, తీసుకున్న ఋణాలు, చెల్లించిన ఋణాలు, మిగిలిన వాయిదాలు మొదలగు మొత్తం సమాచారాన్ని ప్రతి సంఘ సభ్యురాలు 'మన డబ్బులు-మన లెక్కలు' మొబైల్ యాఫ్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. మంగళవారం తిరుపతిరూరల్ ఎంపిడిఓ సమావేశ మందిరములో తిరుపతి జిల్లా వెలుగు కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి మహిళా సంఘ సభ్యురాలికి ఏ అవసరాలు ఏ నెలలో ఏరకమైన అప్పుకావాలి తదితర వివరాలతో వార్షిక ఋణ, జీవనోపాధుల ప్రణాళిక రూపొందించి 2025-26 ఆర్థిక సంవత్సరములో అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి మహిళ లక్షాధికారి కావడానికి పిఎంఎఫ్ఎంఇ, పిఎంఇజిపి, ముద్ర, ఉన్నతి బ్యాంకు ఋణాలు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరములో తిరుపతిజిల్లాలో సెర్ఫ్ వార్షిక ఋణ ప్రణాళిక ద్వారా సుమారు రూ.3200కోట్లకు పైగాఆ మహిళా సంఘ సభ్యులు వివిధ రకాల ఋణాలు తీసుకొంటున్నారని తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానవన, పరిశ్రమలు, చేనేత, హ్యాండీక్రాఫ్ట్స్ వంటి శాఖ అనుసంధానంతో బ్యాంకు సహకారంతో జీవనోపాధుల కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలని డిఆర్‌డిఎ పిడికి సెర్ఫ్ సిఇఓ సూచించారు. మండలాల వారీగా బ్యాంకు మేనేజర్లు, అనుబంధ శాఖల మండల స్థాయి అధికారులు, సెర్ఫ్ సిబ్బందితో కన్వెర్జెన్సీ సమావేశాలు నిర్వహించి, మహిళా సంఘ సభ్యుల జీవనోపాధుల పెంపుకు కృషి చేయాలన్నారు. జీవనోపాధుల కార్యక్రమాలను విజయవంతంగా అమలుకు సిసి,ఏపిఎం,డిపిఎంలు మరింత చొరవ చూపాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్‌డిఎ పిడి శోభన్‌బాబు, అడిషనల్ పిడి ప్రభావతి, తిరుపతిరూరల్ ఎపిఎం పత్తిపాటి నాగేశ్వరరావు, ఏపిఎంలు, డిపిఎంలు, సిపిలు పాల్గొన్నారు.

# ఏ పార్టీలో ఉన్నామో...!

### ఉనికిచాటుకోలేకపోతున్న వైసిపి తటస్థ కార్పొరేటర్లు



ప్రభాతవార్త-తిరుపతి:

తిరుపతి నగరపాలక కౌన్సిల్‌లో తొలిసారి కార్పొరేటర్లుగా ఎన్నికై నాలుగేళ్ళు సర్వంతామై వ్యవహరించిన కొందరు వైసిపి తటస్థ కార్పొరేటర్లు ఇప్పుడు ఏపార్టీలో ఉన్నారనే ఉనికి కూడా చాటుకోలేకపోతున్నారు. ఒక్క కార్పొరేటర్ మినహాయించి 48మంది కార్పొరేటర్లు వైసిపికి చెందిన వారే. ఆ పార్టీ కండువాపై గెలిచి నాలుగేళ్ళు నగరంలో తమ హవా సాగించారు. వారిలో ఒక కార్పొరేటర్ అనారోగ్యంతో మరణించారు. ఒక్క డివిజన్‌కు అస్సలు ఎన్నికలే జరగలేదు. 2024మేనెల సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడం, తిరుపతిలో కూడా గెలవకపోవడంతో అప్పటివరకు అంటకాగిన కొందరు నేతలు, కార్పొరేటర్లు ఒక్కసారిగా కొంతమంది కూటమి పార్టీల పంచన చేరిపోయారు. అంతేగాక ఉపమేయర్‌గా కొనసాగిన భూమన అభినయ్ ఎన్నికల్లో పోటీతో ఆయన పదవికి,కార్పొరేటర్ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో 47మంది కార్పొరేటర్లు ఉండగా వారిలో దాదాపు 25మందివరకు కూటమి పార్టీల్లో చేరారు. 2021 మార్చిలో తిరుపతి నగరపాలకసంస్థకు తొలిసారిగా కౌన్సిల్ ఎన్నికలు జరిగాయి. 50 డివిజన్లలో 48డివిజన్లు వైసిపి కార్పొరేటర్లే కావడం విశేషం. ఆ తరువాత పరిణామాలతో ఇప్పుడు పలు కారణాలతో వైసిపిలో ఇమడలేక...వేసుకున్న కండువా వదలి ఇతర పార్టీల కండువాలు వేసుకునేందుకు సిద్ధమయ్యారు. వీరిలో ఎస్‌కె బాబు ,సికె రేవతి, కల్పనాయాదవ్,మరో ఇద్దరు జనసేనపార్టీ కండువా వేసేసుకున్నారు. ఇక వైసిపిలోనే కొనసాగుతున్న వారిలో మేయర్ శిరీషతోబాటు ఖాదర్‌బాష, ఆదంరాధాకృష్ణారెడ్డి, మునిరామిరెడ్డి, ఆంజనేయులు, శాలినిరెడ్డి, ఉమా యాదవ్, గణేశ్, అమర్‌నాథ్‌రెడ్డి, సునీత, రామస్వామి వెంకటేశ్, తాజిన్, ఆదిలక్ష్మి,గీత, కోటేశ్వరమ్మ, అనిల్, శ్రావణి ఉన్నారు. ఇక తొలినుండి ఉపమేయర్‌గా ఉన్న ముద్రనారాయణ, అన్నా అనిత, నరసింహాచారి,నరేంద్ర ఇలా కొందరు అస్సలు ఏ పార్టీలో ఉన్నామనే చెప్పుకోలేక పోతుండటం కొసమెరుపు. పెద్దసంఖ్యలో వైసిపి కార్పొరేటర్లు ఏడాది పెత్తనం కోసం అధికారంలో ఉన్న టిడిపి పార్టీలో చేరాలని ఉబలాటపడుతున్నా వారికి కాలం కలిసిరా లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేశ్ కార్పొరేటర్ల చేరికలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడమే ప్రధాన కారణం.మరో ఏడునెలలు ఈ కౌన్సిల్ పదవీకాలం ఉంది. 22మంది వరకు కార్పొరేటర్లు స్వతంత్రులుగా చలామణి అవుతున్నారు.

# రియల్ హీరో పవన్ కళ్యాణ్

### - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి విద్య సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:



జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వివిధ సేవా కార్యక్రమాలు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పండుగ వాతావరణంలో జరిగాయి. ఉదయం చెన్నారెడ్డి కాలనీలోని బిసి గర్ల్స్ హాస్టల్‌లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కేక్ కట్ చేసి పవన్ కళ్యాన్ పుట్టిన రోజు వేడుకలను చిన్నపిల్లలు,జనశ్రేణుల మధ్య జరి పారు. అనంతరం విద్యార్థినీలకు బుక్స్, పెన్స్,దుప్పట్లు పంచిపెట్టారు.అనంతరం అలిపిరి శ్రీవారి పాదాల వద్ద కొబ్బరి కాయలు కొట్టి పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆకాంక్షించారు.అలాగే మెటర్నటీ హాస్పిటల్ లో బాలింతలకు పండ్లు, బ్రెడ్,దుప్పట్లు ఎమ్మెల్యే శ్రీనివాసులు పంపిణీ చేశారు. అనంతరం రుయా ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. పేద నాయి బ్రాహ్మణలకు సెలూన్ కిట్స్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందించారు.మహిళలకు చీరలను పంపిణీ చేశారు.ప్రభుత్వ స్కూల్ లో చదువుతూ పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థినీలకు రెండు సైకిళ్ళను ఎమ్మెల్యే తన కార్యాల యం వద్ద పంపిణీ చేశారు. కోట్లాది మంది అభిమానుల ఆదరణే పవన్ కళ్యాణ్ ఆస్తి అని ఆయన అన్నారు. రీల్ హీరోగానే కాకుండా రియల్ హీరోగా పవన్ కళ్యాణ్ మారి గత ఎన్నికల్లో వందశాతం స్ట్రయిక్ రేట్ సాధించారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ హరి ప్రసాద్,రాజా రెడ్డి, వెంకటేశ్వర రావు, హరిశంకర్,అనీల్ రాయల్,ఆముదాల వెంకటేష్, అన్నారెడ్డి యువరాజ్,కెఎంకె లోకేష్,దినేష్ జైన్,సానె శ్రీనివాస్,నీలాద్రీ,కీర్తన, ఆకేపాటి సుభాషిణి, డాక్టర్ వనజ, కార్పోరేటర్లు పొన్నాల చంద్ర,నరసింహాచ్చారి, వరికుంట్ల నారాయణ, సికే రేవతి,కల్పనా యాదవ్,శైలజ, దూది కుమారి,దూది శివ, తిరుత్తుణి వేణుగోపాల్, దూది రమేష్, మునస్వామి,జానకిరామ్ రెడ్డి,ఆర్కాట్ క్రిష్ణప్రసాద్,జోష్ ప్రాపర్టీస్ ప్రకాష్,వినోద్ రాయల్,బాలిశెట్టి కిషోర్, వెంకటేష్,ఆళ్వార్ మురళీ,పగడాల మురళీ,శిరీషా,రాధా,కొండా రాజ్ మోహన్,రమేష్ నాయుడు,చందు,దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులను దోచుకుంటున్న మేర్లపాక టోల్‌గేట్

### నెలవారి పాసుల జారీలో మాయాజాలం





శ్రీకాళహస్తి రూరల్,తొట్టంబేడు,సెప్టెంబర్ 2 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి-తిరుపతి మధ్య మేర్లపాక వద్ద ఉన్న టోల్‌గేట్ నిర్వాహకులు నెలవారి పాసుల జారిలో మాయాజాలాన్ని ప్రదర్శిస్తూ నిత్యం తిరిగే స్థానికుల నుంచి ముక్కుపిండి టోల్ వసూలు చేస్తూ ఇబ్బందులు కల్గిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఈ మేరకు పలువురు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వారితో వివాదానికి దిగారు. ఇక్కడ నిత్యం వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. నాయుడుపేట-గాజుల మండ్యం 71 హైవే నిర్మించారు. దీనిని మే 30న ప్రారంభించారు. మూడు నెలలు గడుస్తుంది. అయితే కర్నూలుకు చెందిన శ్రీ సాయి ఏజెన్సి అనే ఓ సంస్థ దీన్ని కాంటాక్ట్ పద్ధతిన తీసుకుంది. దీని ప్రకారం ఈ మేర్లపాక టోల్‌గేట్ చుట్టుపక్కల 20 కిలో మీటర్లు దూరంలో ఉన్న స్థానికులుగా గుర్తించి వారికి నెల వారి పాసులు జారి చేసింది. నెల వారి చార్జీలుగా రూ.350లుగా నిర్ణయించారు. మూడు రోజుల క్రితం కర్నూలుకు చెందినసంస్థ కాటాక్ట్ ముగిసింది అనే ప్రచారం జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ టోల్‌గేట్ నిర్వహణను హైదరాబాదుకు చెందిన 'ఇంద్రదీప్ ఇండియా లిమిటెడ్' అనే కంపెనీకి దక్కింది. ఇక్కడ ప్రతి నెల 1వ తేదినెల పాసులు జారి చేస్తారని బాధితులు వివరించారు. సోమవారం చుట్టుపక్కల స్థానికులు పాసుల కోసం రాగా జవాబు చెప్పె దిక్కులేదు. సోమవారం స్థానికుల నుంచి రాను పోను రూ.210లు వసూలు చేసుకున్నారని వాపోతున్నారు. కొత్త కాంట్రాక్టరు ముందస్తు సమాచారం ఇవ్వకుండా తిరస్కరించటంతో సమస్య చోటు చేసుకుంది. నేషనల్ హైవేలో కొత్త కాంట్రాక్టర్ వచ్చినపుడు ముందస్తుగా పోలీసులు, పెట్రోలింగ్, హెల్త్ శాఖలకు సమాచారం అందించాల్సి ఉన్నా పట్టించుకోలేదని వివరించారు. ఇక ఇక్కడ 12 వరుసల లైన్లు ఉండగా 6 మాత్రమే పని చేయటం వల్ల నిత్యం ట్రాపిక్ సమస్య చోటు చేసుకుంటుందని బాధితులు వివరించారు. ఇకనకడ స్కానర్లు పని చేయటం లేదని వివరించారు. 100 మీటర్ల దూరంలో ఎల్లో లైన్ ఉంటుందని అక్కడ ట్రాఫిక్ నిలబడితే టోల్‌గేట్ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని కానీ ఆ నిబంధనలను అమలు చేయటం లేదని బాధితులు వివరించారు.

#### సబ్‌ఏజెన్సి...

ఇక్కడ రోడ్లు నిర్మించిన ఏజెన్సి ఒకటైతే ఇక్కడ టోల్ వసూలు చేసుకునే బాధ్యతను సబ్ ఏజెన్సిలకు అప్పగిస్తున్నారు. దాంతో వారి ఇష్టారాజ్యంగా మలుచుకుంటూ వసూలు చేసుకుంటున్నారు. బస్సుల నుంచి ఒక ట్రిప్‌కు రూ.470,రానుపోను రూ705లు (ఆర్‌టిసిబస్సుకు) వసూలు చేస్తున్నారు.అయితే ఇదే అదనుగా ఆర్‌టిసి ఒక్కొక్క టిక్కెట్టుపై రూ.10 అదనంగా వసూలు చేసుకుంటున్నారు.ఇది కకూడా ప్రజల మీదే భారం పడుతుంది.

## మండల 'దేశం' అధ్యక్షుడిగా మరోసారి సుబ్రమణ్యంనాయుడు



**గుడిపాల, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** గుడిపాల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా మరోసారి చలిచీమల సుబ్రమణ్యంనాయుడు ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు గుడిపాల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా చలిచీమల సుబ్రమణ్యంనాయుడును ఎంపిక చేసి మండల పరిధిలో పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలోని ప్రజా దర్బార్ వేదికపై నుండి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండలాల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల కార్యవర్గాలను ప్రకటించారు. ఈ మేరకు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడిగా ధనసింగ్, తెలుగు యువత అధ్యక్షుడిగా చల్లాలు ఎంపికయ్యారు.

## ఘనంగా డిప్యూటీ సిఎం పుట్టినరోజు వేడుకలు



**గుడిపాల, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను మండల జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం జనసేన మండల పార్టీ అధ్యక్షుడు రూప్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి జనసేన ఇంఛార్జ్ ఆరణి కవిత, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడులు ముఖ్య అతిథులుగా హాజరై పవన్‌కళ్యాణ్ జన్మదినం పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రూప్‌కుమార్, మండల దేశం అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడులు, మండల జనసేన ఉపాధ్యక్షుడు ఆదికేశవులు, జనసేన నాయకులు సుధీర్, పవన్, మదన్, అఖిల్, వెంకట్, సురేష్, హరీష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నిరుపేదల జీవితాల్లో వైఎస్ఆర్ చెరగని ముద్ర



**యాదమరి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** నిరుపేదల జీవితాల్లో దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చెరగని ముద్ర వేశారని మాజీ జడ్పీటీసీ, వైకాపా నాయకులు కోణాపల్లి మనోహరన్ అన్నారు. యాదమరి మండల వైకాపా కార్యాలయ ఆవరణలో మంగళవారం దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మాజీ జడ్పీటీసీ కోణాపల్లి మనోహరన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు రవీంద్రబాబు, హరినారాయణరెడ్డిలు, నాయకులు కరుణాకర్, మణివేలు, పరందామగౌడ్, రమేష్, కోటీశ్వర, ఎంపిటిసి దుర్వాసులు, మండల పార్టీ నాయకులు మనోహర్‌రెడ్డి, దయానందరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేష్, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అపోలో యూనివర్సిటీలో జాతీయ క్రీడా దినోత్సవం



**చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** ది అపోలో యూనివర్సిటీ స్పోర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం-2025 అపోలో నాలెడ్జ్ సిటీలోని క్రీడా మైదానంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్‌భట్ హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని యూనివర్సిటీలో ఆగస్టు 23వ తేదీ నుండి వారం రోజుల పాటు కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ రేస్, టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడల్లో గెలుపొందిన వారికి మంగళవారం నిర్వహించినసర్టిఫికేట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె.ఆగస్టిన్, సిఇఒ నరేష్‌కుమార్‌రెడ్డి, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ రామయ్య ఇటుమల్ల, స్పోర్ట్స్‌క్లబ్ కో-ఆర్డినేటర్ జి.స్వప్న, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎడి దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల వైద్య పరీక్షల్లో రెండు రోజులు మార్పులు

**చిత్తూరు, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించుకోవడానికి ఈ నెల 5, 7 తేదీల్లో నిర్వహించే వైద్య పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరులో మంగళవారం నుండి 7వ తేదీ వరకు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు జరుగనున్నాయి. ఇందులో ఈ నెల 5వ తేదీ జరుగాల్సిన పురుష అభ్యర్థుల వైద్య పరీక్షలను ఈ నెల 8వ తేదీకి మార్చడం జరిగిందన్నారు. అలాగే 7వ తేదీ జరుగాల్సిన వైద్య పరీక్షలను 9వ తేదీకి వాయిదా వేసినట్లు ఎస్పీ తెలిపారు. అలాగే మిగిలిన అభ్యర్థుల వైద్య పరీక్షలను ఈ నెల 10వ తేదీకి మార్చడం జరిగిందన్నారు.

## ప్రతి పంటలకు ఈ-క్రాప్ బుకింగ్



**యాదమరి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** రైతు సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలని అగ్రికల్చరల్ ఎడి ఉమ అన్నారు. యాదమరి మండలం న్రరావూరు గ్రామ పరిధిలోని మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎడి ఉమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ప్రతి పంటకు రైతులు అవసరమైన మేరకు మాత్రమే యూరియా కొనుగోలు చేసుకోవాలన్నారు. అలాగే పంటల సాగుకు నీమాస్త్రం, జీవామృతం వంటి సేంద్రీయ ద్రావణాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె వరి పొలంను పరిశీలించి ఆకు ముడత తెగులు, పోషక లోపాల సమస్యలను గుర్తించి దీనికి తగిన నియంత్రణ చర్యలను రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీప, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను కొనసాగించాలని కడ పి.డి.కి వినతి



**కుప్పం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** శాంతిపురం మండలంలోని నారసింహేపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌ను కోరారు. గ్రామంలోని పాఠశాలలో ప్రస్తుతం 13మంది విద్యార్థులు చదువుకుంటున్నారని అయితే తమ గ్రామంలోని పాఠశాలను రెండు కి.మీ.ల దూరంలో ఉన్న మొరసనపల్లి పాఠశాలలో విలీనంచేశారన్నారు. అయితే ఆ పాఠశాలకు తమ పిల్లలను పంపాలంటే చెరువు కట్ట మీదుగా మరువలు దాటి వెళ్లాల్సి ఉందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన పి.డి. గ్రామానికి వచ్చి పరిశీలన చేస్తామని హామీ ఇవ్వడంతో వెనుతిరిగారు.

## నేడు జిల్లా స్థాయి యోగాసన పోటీలు

కుప్పం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త

స్థానిక విశ్వశాంతి యోగాశ్రమం వద్ద బుధవారం జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు సంతోష్‌కుమార్, గణేష్, నీలిమ తెలిపారు. 8-19 ఏళ్లలోపు వయసు గల వారికి సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు ఫోన్ నెం 9989093290కు సంప్రదించాలని కోరారు.

## కాణిపాకంలో నేడు (బుధవారం)

పగలు : అభిషేకం, దేవస్థానం వారిచే : రథోత్సవం

వరుస ఉభయదారులు: అభిషేకం: కీ॥శే॥ శ్రీ కె.యతిరాజులు నాయుడు, కాకర్లవారిపల్లె వారి జ్ఞాపకార్థం వారి కుమార్తె శ్రీమతి మీనాకుమారి, కీ॥శే॥యన్.శివప్రసాద్ నాయుడు దంపతులు, రథోత్సవం: శ్రీ కె.పూర్ణచంద్రారెడ్డి, మాజీ వి.యం.కాణిపాకం, కీ॥శే॥ శ్రీ కె.చంద్రశేఖరరెడ్డి, మాజీ వి.యం వారి జ్ఞాపకార్థం వారి కుమారుడు కె.హరిప్రసాద్‌రెడ్డి, కాణిపాకం వారిచే, మండపడి వినియోగం-గంగుంద్ర మండపం వద్ద జరుపబడును.

***ఆస్థాన మండపంలో...*** సాంస్కృతిక కార్యక్రమాలుఉదయం 10 గంటల నుండి అర్ధరాత్రి 1గంటల వరకు భక్తిగీతాలు, కూచిపూడి, భరతనాట్యం, హరికథలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి పలు బృందాలచే కోలాటాలు, చెక్కభజనలు, వంటి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు. రథోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులచే వైవిధ్యభరితమైన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శనలు.

## మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి

పాలసముద్రం: సెప్టెంబర్ 2 ప్రభాతవార్త



పాలసముద్రం మండలం పాలసముద్రం గ్రామం గుండు బావి వద్ద మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా వైయస్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి జడ్పిటిసి అన్బు అలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, స్థానిక ఎంపీటీసీ గోవిందరాజులు వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు సుందరాజు స్థానిక సర్పంచ్ అయ్యప్పన్ మరియు వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని వైయస్ రాజశేఖర్ రెడ్డి కి నివాళులర్పించారు.

## ఘనంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

పాలసముద్రం: సెప్టెంబర్ 2 ప్రభాతవార్త పాలసముద్రం మండలం వన దుర్గ పురం లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పంచాయతీ అధ్యక్షుడు పురుషోత్తం యాదవ్ అధ్యక్షతన కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం ఇన్చార్జి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు పొన్న యుగంధర్ నూతనంగా నిర్మించిన జన సేన జెండాను ఆవి ష్కరించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు లతీష్ కుమార్ మరియు మండలంలోని కూటమి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## స్వర్గీయ వైఎస్ఆర్‌కు ఘన నివాళులు

చిత్తూరురూరల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:



స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతిని పురస్కరించుకొని సంతపేట, రాగిమాను వీధి నందు వైఎస్ఆర్ సిపి రాష్ట్ర మొదలియార్ సంఘ అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గ వైఎస్ఆర్ సిపి సమన్వయకర్త విజయానందరెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. ముందుగా ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించి, అనంతరం పేదలకు అన్నదానం చేసారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కెపి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు



గంగాధర నెల్లూరు సెప్టెంబరు 2 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి నియోజక వైఎస్ఆర్సిపి ఇచార్జి కృపాలక్ష్మి గజ మాల వేసి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయన ప్రవేశ పెట్టిన పథకాలే నేటికి చాలా వరకు అమలవుతున్నాయని అన్నారు. అనంతరం స్థానిక నాయకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పేదలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకట రెడ్డి ఎంపిపి అనిత లోకేష్ జడ్పిటిసి లక్ష్మీప్రియ దామోదరం వైస్ ఎంపిపి హరిబాబు నాయకులు వేల్కూరు బాబు రెడ్డి కామసాని చిన్నమ్మ రెడ్డి హేమచంద్ర రామచంద్రరెడ్డి మునిరాజా రెడ్డి రూపా రెడ్డి అంబోదర పల్లి బాబు రెడ్డి సర్పంచులు గోవింద స్వామి సుబ్రమణ్యం యాదవ్‌లతో పాటు ధిల్లీ కుమార్ మదన్ మోహన్ మోసెస్ మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సదుంలో ఘనంగా వైయస్ వర్ధంతి వేడుకలు

సదుం, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త



రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు మంగళవారం సదుం పట్టణంలోనూ, జోగివారిపల్లి పంచాయతీ లోనూ ఘనంగా నిర్వహించారు. సదుం బస్టాండ్‌లో ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పుత్రాజు, ధనుంజయ రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ఉమ్మడి జిల్లాల ఐటీ వింగ్ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సర్పంచులు అనిత కుమారి, ఉషారాణి, మధుసూదన్ రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సదుంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు



**సదుం, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం సదుం బస్టాండులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల జనసేన నాయకులు మదిరాల ఆనంద్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు నాగతేజ , అన్వర్ భాష, శేఖర్, హరి, రమేష్, యశ్వంత్, హర్ష, భాష, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌కు ఘన నివాళులు



**కుప్పం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి వైఎస్సార్సీ నేతలు ఘన నివాళులు అర్పించారు. మంగళవారం వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్సీ భరత్ క్యాంప్ కార్యాలయం, కుప్పం బస్టాండులోని వైఎస్ఆర్ విగ్రహంకు ఆపార్టీ నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి భౌతికంగా ప్రజలమధ్య లేకున్నా ఆయన ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదిం చుకున్నారన్నారు. ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో ఉపయుక్తకరంగా మారాయన్నారు. కార్యక్రమాల్లో వైకాపా రాష్ట్ర యువజన విభాగం జాయింట్ కార్యదర్శి భాగ్యరాజ్, కౌన్సిలర్లు హఫీజ్, మోహన్‌రాం, రాజ్‌కుమార్, మునిరాజు, మణి, మైనార్టీ నేత అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

**శాంతిపురం:** మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరచిపోలేనివని మాజీ రెస్కో ఛైర్మన్ చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్ఆర్ విగ్రహంకు వైఎస్ వర్ధంతి సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ వైఎస్ఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.నేతలు కోదండరెడ్డి, దండపాణి, ఎవి జయరాం, మురళీమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమం కోరేది కూటమి ప్రభుత్వం

టిడిపి మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్



**కుప్పం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** పేదల సంక్షేమం కోరేది సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అని టిడిపి మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లిలో ప్రజలకు నూతన రేషన్ స్మార్ట్ కార్డులను తహశీల్దార్ చిట్టిబాబు, సర్పంచ్ రాజశేఖర్ తో కలసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాభక్షక పాలన పోయి ప్రజా రక్షణ పాలన వచ్చిందన్నారు. తమ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ ముందుకుసాగు తోందని, ప్రజలు ఆదరించాలని కోరారు.నేతలు కృష్ణయ్య,వెంకటేష్,నాగరాజు,విజయకుమార్,బాలకృష్ణ,కదిరప్ప, సంతూరు, మణి, హైదర్ వలీ పాల్గొన్నారు.

## ఘనంగా డి.సిఎం పవన్‌కళ్యాణ్ జన్మదినవేడుకలు



**కుప్పం. సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను నియోజకవర్గ కోఆర్డినేటర్ నరేష్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో డి.సిఎం పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, బిజెపి కన్వీనర్ తులసినాథ్ తదితరుల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. అడవి బూదుగూరులో ఈసందర్భంగా పార్టీ పతాకా విష్కరణ చేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు అమీర్,వామనమూర్తి, పాండు, కిషోర్, నవనీత తదితరులు పాల్గొన్నారు.

**శాంతిపురం :** డి.సిఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను శాంతిపురంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కిషోర్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి పళ్ల మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుప్పం కోఆర్డినేటర్ నరేష్, నేతలు వామనమూర్తి, రామూర్తి, వేణు, నవీన్, మునోప్ప, నవనీత, కుసుమ, ధనుష్, హరికుమార్, పాండు పాల్గొన్నారు.

**వి.కోట :** డి.సిఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను వి.కోటలో మండల అధ్యక్షుడు బాబు అధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈసందర్భంగా రక్తదాన శిబిరంను సిఐ సోమశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పళ్లు పంచారు.అంబేద్కర్ సర్కిల్‌లో అన్నదానం జరిపారు. కార్యమ్రంలో నేతలు పూలచైతన్య, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## వివాదాస్పద భూమిలో ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు

**శాంతిపురం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** స్థానిక మండల సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న వివాదాస్పద భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి ప్రభుత్వ భూమిగా గుర్తించారని తహశీల్దార్ శివయ్య తెలిపారు. సర్వే నెం 92/2లో 2.08 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి మంగళవారం బోర్డులు ఏర్పాటుచేశామన్నారు. త్వరలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

## నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత

శాంతిపురం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త



ఉపాధిహామీ పనుల్లో నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపిడిఒ పిఆర్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కొలమడుగు పంచాయతీ చిలిమానుపల్లి గ్రామంలో ఆయన ఉపాధి పనులు తనిఖీ చేసి మస్టర్లు పరిశీలించారు. అనంతరం మాట్లాడుఎతూ నీటి సంరక్షణ పనులపనుల ద్వారా నీరు వృధా కాకుండా నీటి కుంటలు, పశువుల కుంటలు, పూడికతీత పనులు చేపట్టడంతో నీటి రక్షణకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎ వెంకటపతి, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

## రచయిత దేవరాజుకు కళాకారులు సన్మానం

తిరుపతి రవాణా, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త



సమాజ హితం కోరుతూ ఎన్నో కథలు, వ్యాసాలు, కవితలు రచించి ప్రజల అభిమానాన్ని చేరుకున్న రచయిత దేవరాజులు జన్మదినాన్ని పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలం కళాకారులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ మానవత్వాన్ని ప్రేరేపిస్తూ మంచి నడకను అలవాటు చేసుకునే విధంగా రచయిత దేవరాజులు కథలు చాలా గొప్పగా ఉంటాయని ఆయన తిరుపతి వాసి కావడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కే ఎన్ రాజా సోము ఉమాపతి జ్ఞానమ్మ రాజేంద్ర రాజశేఖర్ రెడ్డి కొట్టే సుబ్రహ్మణ్యం రెడ్డి పురోహితుడు సురేష్ స్వామి తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కొబ్బరిసాగు రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** కొబ్బరిసాగు చేపడుతున్న రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు.మంగళవారం స్థానిక హార్టీకల్చర్ హబ్‌లో ప్రపంచ కొబ్బరి దినోత్సవంను పురస్కరించుకుని ఉద్యానవన శాఖ, కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు అధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో రైతులు ఉద్యానవన పంటలపై మక్కువ చూపాలన్నారు. పంటలసాగుపై సలహాలు, సందేహాలకు సిఓఇను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోకోనట్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ్, ఎడి రాగోతం, డిఒ శరత్‌లు భారతీయ కొబ్బరి పత్రికను విడుదల చేశారు. ఈసందర్భంగా కొబ్బరి సాగు, మెళకువలు, పథకాల గురించి వివరించారు. ఉద్యానవన శాఖ ప్రవేశ పెట్టిన వీట్ మ్యాట్ గురించి ఎడి పల్లవి రైతులకు వివరించారు.పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు,టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రైతు విభాగం అధ్యక్షుడు చలపతి, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## ఇది పేదల పక్షపాతి ప్రభుత్వం: విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు



పుంగనూరు సెప్టెంబర్ 2 ప్రభాతవార్త రాష్ట్రంలో నడుస్తున్న ప్రభుత్వం పేదల పక్షపాతి అని, పేదల అభ్యున్నతే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని హైస్కూల్ వీధిలో పేదలకు స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు పండ్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 75 రూపాయల నుంచి నాలుగు వేల వరకు పెన్షన్ పెంచిన ఘనత చంద్రబాబుదే అన్నారు. గత పాలనలో రాష్ట్రం రాక్షసుల బారినపడి విలవిలలాడిపోయిందన్నారు. కల్తీ మద్యంతో రాష్ట్రంలో లక్షలాది ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని ఆరోపించారు.బిజెపి పట్టణ అధ్యక్షుడు జగదీశ్వర్ రాజు దేశం, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెండి తెరపైనే కాదు..

వెలుగు రేఖలపై పవన్ రారాజు



**పుంగనూరు రూరల్ సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** తమ అభిమాన నాయకుడు పవన్ కళ్యాణ్ వెండితెరపైనే కాదు, పేదల సంక్షేమనే వెలుగు రేఖలపై కూడా రారాజుగా వెలుగొందుతాడని ఉమ్మడి చిత్తూరు జిల్లాల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, సింగల్ విండో చైర్మన్ పగడాల రమణ అన్నారు. మంగళవారం ఉదయం జనసేన నేత జన్మదినం సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సంబరాల నిర్వహించారు. ఈ సందర్భంగా అతిపెద్ద కేక్ కట్ చేసి ప్రజలకు పంచారు. అనంతరం పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారికి పాలు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో పలుచోట్ల ప్రజలకు ఆహారం పంపిణీ చేశారు.

## ఘనంగా ఉప ముఖ్యమంత్రి పవన్ జన్మదినం



**పుంగనూరు రూరల్ సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నందు జనసేన నాయకులు వేణు గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ, కేక్ కటింగ్ చేస్తూ, అన్నదానం నిర్వహించారు.రూరల్ మండలం లో వెంకటాద్రి కాలనీ, పాలెంపల్లి, నెక్కుంది, సుగాలిమిట్ట మరి కొన్ని చోట్ల ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జనసేన టీడీపీ మండల అధ్యక్షులు మాధవ రెడ్డి, విరూపాక్షి , నాయకులు శివ కుమార్ రెడ్డి, హరి నాయక్, బాలాజీ నాయక్, చిన్నా, పాముల హరి, మంజు, జయపాల్ రెడ్డి ,మనోహర్ రెడ్డి, శ్రీరాములు, బొట్టు శ్రీనా , రేవంత్, నాయుడు, పవన్ నాయక్, వెంకటేష్, చిట్టి మరియు అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని పండుగ చేసిన వైఎస్సార్



**చౌడేపల్లి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** వ్యవసాయానికి మంచి గుర్తింపునిచ్చిన నేతగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చరిత్రలో నిలచిపోతారని వైకాపా నాయకులన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ 16వ.వర్ధంతిని స్థానిక బస్టాండులో ఘనంగా నిర్వహించారు. ఆహార, విద్యా, ఆరోగ్య భద్రత కల్పనలో దేశంలో ముఖ్యమంత్రులకే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆదర్శంగా నిలచారన్నారు. రాష్ట్ర వైకాపా ఉపాధ్యక్షుడు నడింపల్లి దామోధర్‌రాజు, మండల పార్టీ అధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి, మాజీ ఎంపిపి కూరపర్తి అంజిబాబు, రాష్ట్ర వైకాపా విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్‌భరత్, ఉపాధ్యక్షులు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, జంగాలపల్లి రమణ, రవిచంద్రారెడ్డి, పవన్‌రాయల్, హరీష్‌రాయల్, గ్రెంధెం మంజునాథ్, షంషీర్‌భాషా, హరినాథ్, అల్తాఫ్, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోలాహలంగా పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు

-సేవా కార్యక్రమాల్లో అభిమానులు నాయకులు



**చౌడేపల్లి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆయన అభిమానులు, జనసేనపార్టీ నాయకులు స్థానిక ఆరోగ్య కేంద్రం నందు రోగులకు పాలు, పండ్లు పంచిపెట్టారు. అనంతరం బస్టాండు నందు కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ రాష్ట్రంలోని ప్రజలకు చేస్తున్న సేవలను నియోజకవర్గ స్థాయి నాయకులు కోలా సోమశేఖర్, పగడాల రమణలు వివరించారు. మండల బాధ్యుడు పురుషోత్తమ్ కూటమి నాయకులు సింగిల్‌విండో అధ్యక్షుడు హరిరాయల్, లీలాకుమార్‌నాగ్, ఘనస్యామ్, భూదేవి హోటల్ మురళి, సాయికిరణ్, రాఖీ, నగేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీశక్తి విజయోత్సవ సభకు స్థలాన్ని పరిశీలన

చౌడేపల్లి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త



స్త్రీశక్తి విజయోత్సవ సభకు స్థలాన్ని పరిశీలించారు. పుంగనూరు నియోజకవర్గ తేదేపా ఇన్‌ఛార్జీ చల్లా రామచంద్రారెడ్డి, మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డిలు దిగువపల్లి పంచాయతీ బోయకొండ గంగాపురంలో గల స్థలాన్ని పరిశీలించారు. నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమం నిర్వహిస్తున్నామనీ, మహిళామణులందరూ అధిక సంఖ్యలో హాజరవుతున్నందున పగడ్బంధీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు వివరించారు. పుంగనూరు రూరల్ సిఐ రాంభూపాల్, ఎస్ఐ నాగేశ్వరరావు, తేదేపా నాయకులు శ్రీధర్‌రాజు(గిరి), బోయకొండ సుబ్బు, రెడ్డి, సోము, తదితరులు పాల్గొన్నారు.

## స్వామిత్వ సర్వేను త్వరిగతిన చేపట్టాలి : డిప్యూటీ కలెక్టర్



**చౌడేపల్లి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** మండలంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను త్వరిగతిన చేపట్టాలని డిప్యూటీ కలెక్టర్ భవానీ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిపాలనా భవనంలో మండలంలోని రెవిన్యూ, సచివాలయ ఉద్యోగులతో స్వామిత్వ సర్వేపై చర్చించారు. ప్రతి ఇంటినీ సర్వే చేసి లబ్దిదారునికి యాజమాన్య హక్కును కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆ దిశగా అధికారులు లక్ష్యాలను అధిగమించాలన్నారు. గ్రామ రెవిన్యూ సరిహద్దులు, ప్రభుత్వ స్థలాలను గుర్తించాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. తహశీల్దార్ పార్వతి, ఎండిపిఓ లీలామాధవి, మండలంలోని రెవిన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జాబ్‌మేళాకు విశేష స్పందన



**చిత్తూరురూరల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** చిత్తూరు పట్టణం, పివికెయన్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు పరిసర ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువతీ యువకులు, డిగ్రీ, పిజి, ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు 347మంది హాజరుకాగా అందులో 162 మంది అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డా. జీవన్‌జ్యోతి తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచంలో సరైన నైపుణ్యాలు వుంటేనే ఉద్యోగవకాశాలు దక్కించుకోవడం సాధ్యమవుందనీ, ఈ కోణంలో తమ కళాశాల నందు విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలే కాకుండా వారి కేరీర్‌కు అవసరమైనవాటిని మార్గనిర్దేశం చేయడం కూడా తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే చొరవతో ఇలాంటి బృహత్తర కార్యక్రమం తమ కళాశాలలో నిర్వహించడం గర్వంగా వుందని, ఈ జాబ్‌మేళాలో వందలాదిమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగవకాశాలు లభించడం సంతోషంగా వుందని పేర్కొన్నారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యఅతిధుల చేతుల మీదూ నియామక పత్రాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, డిఎస్‌డివో గుణశేఖరరెడ్డి, కళాశాల స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ జెకెసి మెంటార్ ఎన్‌విఎన్ నారాయణరావు, వివిధ విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## సినీ,రాజకీయ రంగాలకు వన్నె తెస్తున్న పవన్ : విశ్వనాథం



వెంకటగిరి, ఆగస్టు 2 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తర్వాత సినీ రాజకీయ రంగాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాణిస్తున్నారని ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం తెలిపారు, వెంకటగిరి పట్టణంలోని త్రిభుని డీలక్స్ సినిమా థియేటర్ కోడలిలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా జనసేన పార్టీ, టిడిపి, బిజెపి నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కాపు బలిజ సంక్షేమ సంఘం ట్రస్ట్ చైర్మన్ తోట కృష్ణయ్య మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌ని సీఎంగా చూడాలని అందరూ కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో సిఐ ఏవి రమణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, టిడిపి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## సూళ్లూరుపేటలో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన, పవన్ కళ్యాణ్ అభిమాన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకులు ఆవుల రమణ, షేక్ మాబాషా ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరిబాబు, కోటి, తేజ, రేవంత్, ప్రభు, సూరి, నాగరాజు, పద్మజ, సుజాతలు పాల్గొన్నారు.

## మహానేత వైఎస్సార్‌కు నివాళి



కోట, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: ప్రజల హృదయాల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని కోట మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోట క్రాస్‌రోడ్డులో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం గూడూరు డివిజన్ యువ నాయకులు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రతిపక్షంగా ప్రజల తరపున తాము మాట్లాడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి, సిద్దవరం సొసైటీ మాజీ ఛైర్మన్ సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, మాజీ జడ్పీటిసి ఉప్పల ప్రసాద్‌గౌడ్, మండల జనరల్ సెక్రటరీ పాముల సురేంద్ర, మహిళా నాయకురాలు సుధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల హృదయాల్లో చిరంజీవిగా ఉన్న వైయస్ : నేదురుమల్లి



వెంకటగిరి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త : దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి భౌతికంగా లేకపోయినా ప్రజల హృదయాల్లో చిరంజీవిగా ఉన్నట్టు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు రాష్ట్రాల్లో రాజశేఖర్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్లు శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాసులు, నారాయణ, కళ్యాణి, పూజారి లక్ష్మి, ఆరి శంకరయ్య, నాయకులు పాల్గొన్నారు.

## పేదల పాలిట పెన్నిధి వైయస్ఆర్ : వెందోటి



బాలాయపల్లి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి అందరి హృదయాల్లో నేటికీ చిరస్థాయిగా దేవంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి నిలిచారని వైసీపీ మండల కన్వీనర్ వెందోటి కార్తీక రెడ్డి తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన మండల కన్వీనర్, వైసీపీ శ్రేణులు సర్వేపల్లి సురేష్ గుర్రం రామ్మూర్తి, కల్తిరెడ్డి రాజారెడ్డి, గుండెబోయిన గోపాల్ యాదవ్. వైయస్ రాజశేఖర్ రెడ్డి అడుగుజాడలల్లో నాయకులు, కార్యకర్తలు పయనించాలని తెలిపారు.

## 4న జయంపులో పింక్ బస్ క్యాంపు

బాలాయపల్లి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: టీటీడీకి చెందిన తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో ఈ నెల 4న గురువారం బాలాయపల్లి మండలంలోని జయంపు గ్రామంలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో పింక్ బస్ క్యాంపు జరుగనుందని వైద్యాధికారి డాక్టర్ లియోన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు క్యాంపు ప్రారంభమవుతుందని, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అటవీశాఖ అధికారిగా వెంకట్



వెంకటగిరి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: వెంకటగిరి అటవీశాఖ సబ్ డివిజనల్ ఫారెస్ట్ అధికారిగా కొల్లూరు వెంకట శ్రీకాంత్‌ను ప్రభుత్వం నియమించింది. ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్లో శ్రీకాంత్ ప్రథమ స్థానం సాధించారు. వెంకటగిరి ప్రాంతంలో వెలుగొండ అడవులలో ఎర్రచందనం, వృక్ష సంపద ఎక్కువగా ఉండటంతో ఐఎఫ్ ఎస్ అధికారిని నియమించారు. ఇటీవల కాలంలో ఎర్రచందనం స్మగ్లింగ్ కూడా జోరుగా సాగుతోంది.

## ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుకలు



ఓజిలి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: ఓజిలిలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైయస్సార్ విగ్రహంకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, ఓజిలి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బెల్లం సుబ్బానాయుడు, వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్ నాయుడు, జిల్లా కార్యదర్శి కొండూరు వెంకట సుబ్బరాజు, మాజీ మండల కన్వీనర్ జరుగుమల్లి బాబు రెడ్డి, ఎంపీటీసీ రఘురామరాజు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్ బాషా, సీనియర్ నాయకులు కొండూరు దామోదర్ రాజు, సర్పంచ్ ఎల్లా సురేష్ రెడ్డి, ముమ్మడి రామయ్య, పిండు కూరు మసుదన్ రెడ్డి, నారాయణరెడ్డి, ఏసీ సెల్ అధ్యక్షుడు జడ్డా చంద్ర, చేనేత విభాగం అధ్యక్షుడు ఎద్దు చిన్నపించలయ్య, సర్పంచ్ కొండూరు ప్రభాకర్ రాజు, చింతల విజయ్ కుమార్, కాకాన్ రవి, జమళ్ళ రవి, గూడూరు సురేందర్ రెడ్డి, కొలనకుదురు సురేష్ రెడ్డి, ఎల్లం రాజు వెంకట రమణరాజు, పరస శంకర్, పసుపులేటి రమణయ్య, పంజాం ప్రతాప్ కుమార్, జయరామయ్య, ఈశ్వర్ రాజు రామచంద్రరావు, సాయి, అజ్మతుల్లా, పూసల కుమార్ నాయుడు, అరవ భూమి రాజారెడ్డి, పరంగి ప్రసాద్, గజ్జల సాయికుమార్, శ్రీనివాసులు శెట్టి, పల్లంపర్తి గిరి రెడ్డి, తిట్టేటి తిరుపాలయ్య, సుబ్బారెడ్డి, శ్రీహరి, మురళి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పంట కాలవలో పడి వ్యాన్ డ్రైవర్ మృతి

చిల్లకూరు, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: చిల్లకూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా జ్యోతి కాటా వద్ద తమిళనాడు రాష్ట్రంలోని తూత్తుకుడికి చెందిన రొయ్యల వ్యాన్ డ్రైవర్ ఆనంద ప్రభు (33) వ్యక్తి మంగళవారం ప్రహరి గోడపై కూర్చొని అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలవలో పడి మృతి చెందాడు. స్థానికులు సమాచారంతో చిల్లకూరు ఎస్ఐ సురేష్ బాబు సంకట అసలా చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా పైన తెలిపిన అడ్రస్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగింత



చిల్లకూరు, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: మనుబోలు మండలం కాగితాలు పూర్ గ్రామానికి చెందిన గిరిజన కుటుంబం జీవనాధారం కోసం చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో పంట పొలాల వద్ద కాపుల ఉన్నారు. అయితే కత్తి చెంచయ్య కుమార్తె కత్తి జ్ఞానమ్మ అనే చిన్నారి తల్లిదండ్రుల నుండి తప్పిపోయి చిల్లకూరు బైపాస్‌లో ఒంటరిగా తిరుగు తుండగా కొందరు వ్యక్తులు చిల్లకూరు పోలీస్ స్టేషన్లో ఎస్ఐ సురేష్ బాబుకి అప్పగించారు. వెంటనే స్పందించిన అధికారులు తూర్పు కనుపూరు గ్రామాల పంటపొలాల వద్ద ఉన్న చిన్నారి తండ్రికి ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మజ సమక్షంలో అప్పగించారు.

## ట్రాన్స్ఫార్మర్ల చోరీ కేసులో నిందితులు అరెస్ట్

గూడూరు, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్ఫార్మర్ల చోరీల కేసులకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందని రూరల్ సీఐ కిషోర్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుడూ గూడూరు మండలం, బాలాయపల్లి, డక్కిలి, చిల్లకూరు తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాన్స్ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్‌ను అపహరించుకు వెళ్లిన కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది బాలకృష్ణయ్య, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, విష్ణుకుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి అవార్డు గ్రహీతకు సన్మానం



వెంకటగిరి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: స్థానిక బడిమల నాగయ్య జూనియర్ కళాశాలలో పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం వారు, చేనేత పరిశ్రమలో విశేష కృషి చేసినందుకుగాను రాష్ట్రపతి అవార్డు అందుకున్న లక్కా. శ్రీనివాసులుని ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీరామ నాగేశ్వరరావు, తిరుపతి జిల్లా మహిళా విభాగం సెక్రటరీ బడిమల సునీత, స్థానిక కళాశాల ప్రిన్సిపల్ బడిమల జయశేఖర్ బాబు, ఇతరక పిఇఓ మిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల బాంధవుడు వైయస్



వాకాడు, సెప్టెంబర్ 2ప్రభాతవార్త: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి రైతుల పాలిట బాంధవుడని వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కొడవలూరు దామోదర్ రెడ్డి అన్నారు. మంగళవారం వాకాడు అశోక పిల్లర్ సెంటర్ సమీపంలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో మండల వైకాపా అధ్యక్షుడు ఏనుగు సుధాకర్ నాయుడు, ఉప సర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్లు సిద్ధారెడ్డి మధుసూదన్ రెడ్డి, విజయ్ రెడ్డి, నేదురుమల్లి హిమ కుమార్ రెడ్డి,వాకాటి రవికుమార్, నల్లా మధుసూదన్ రెడ్డి, రౌతు నాగరాజు, గూడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, బాలకృష్ణయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోటలో డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు



కోట, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం కోటలో జనసేన పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, మధు, ఎన్.సురేష్, జగదీష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలపై దాడులు

కోట, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: కోటలో మంగళవారం ఉప రవాణాశాఖ అధికారి ప్రభాకర్‌రావు పలు వాహనాలపై దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. రవాణాశాఖ నిబంధనలను వివరించారు. ప్రతి వాహనదారుడు పొల్యూషన్ సర్టిఫికెట్, వాహనాలకు సంబంధించిన పత్రాలు, లైసెన్సు ఖచ్చితంగా కలిగి ఉండాలన్నారు. వాహనదారులు ఎవరైనా నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఇస్కాన్ ఆధ్వర్యంలో రాధా జయంతి వేడుకలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: నెల్లూరు ఇస్కాన్ సంస్థ సూళ్లూరుపేట ఇస్కాన్ ప్రచార కేంద్రం వారి ఆధ్వర్యంలో మంగళవారం రాధా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీనగర్ కాలనీలోని యశోద రెసిడెన్సిలో శ్రీకృష్ణుడికి పుష్పాభిషేకాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. నెల్లూరు ఇస్కాన్ సంస్థ అధ్యక్షులు శుకదేవ మహరాజ్, వెంకటరమణారెడ్డి, ఎంవి రమణయ్య, ఇస్కాన్ సంస్థ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో వైఎస్సార్‌కు ఘన నివాళి



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న విగ్రహానికి మంగళవారం ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, జెట్టి వేణుయాదవ్, వి.కృపాకర్‌రెడ్డి, అల్లూరు రమేష్‌రెడ్డి, బందిలి రమేష్, చిలకా యుగంధర్, సిహెచ్ సుబ్రహ్మణ్యంరెడ్డి, తుపాకుల ప్రసాద్, బద్దెపూడి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు వైయస్సార్ : కామిరెడ్డి



పెళ్లకూరు సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :మహానేత వైయస్సార్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన పెళ్లకూరులో ఉన్న వైయస్సార్ విగ్రహానికి వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎన్‌డిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్ఆర్సిపి అభిమానులు వైయస్సార్ జిందాబాద్ వైయస్సార్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ వైయస్సార్‌తో తమకున్న జ్ఞాపకాలను గురించి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎంపీటీసీ నన్నం ప్రిస్కిల్లా వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు ఒబ్బు వెంకటరత్నం ఎల్లు మోహన్ అట్ల కృష్ణయ్య కన్నలి బాలాజీ వై జాకాబ్ మరియు వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పెళ్లకూరు సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం లోని బంగారం పేట గ్రామానికి చెందిన కట్టా వెన్నెల తండ్రి శేషయ్య14 సంవత్సరాల బాలిక 28వ తేదీ గురువారం నాడు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని అప్పటినుండి ఎక్కడ వెతికిన కనిపించలేదని మంగళవారం నాడు పెళ్లకూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఫోన్ నెంబర్లకు (9550088982) (9177957632) తెలియజేయగలరని పెళ్లకూరు పోలీస్ ఎస్సై నాగరాజు తెలిపారు.

## ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు



పెళ్లకూరు సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శిరసనం బేడు గ్రామం చెక్ పోస్ట్ వద్ద జనసేన పార్టీ యువ నాయకులు శ్రీపతి ఉపేంద్ర ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు విజయ్ మల్లాం సీనియర్ నాయకులు కేశవరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని కేకులు కట్ చేసి స్వీట్లు పంచి జనసేనని పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకను ఎంతో అటహాసంగా జరుపుకున్నారు.

## టిడిపితోనే మహిళల అభివృద్ధి : ఎమ్మెల్యే



నాయుడుపేట, సెప్టంబర్2 ప్రభాతవార్త : రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వ హయం లోనే మహిళలను అన్నివిధాల అభివృద్ధి చేయడం జరుగుతుందని సూళ్ళూరుపేట శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఆవర్ణంలో నిర్వహించిన స్త్రీశక్తి విజయోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ, అసమానతలు తొలగించి మహిళా సాదికారిత సాదించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీఎంపి నెలవల సుబ్రమణ్యం, నియోజకవర్గ పరిశీలకుడు జడ్ శివప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు సన్నారెడ్డి చంద్రారెడ్డి,సంచి కృష్ణయ్య, విజయకుమార్ నాయుడు, వేమసాని శ్రీనివాసులు నాయుడు,కట్టా వెంకటరమణారెడ్డి,తిరుమూరు సుదాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్,తదితర తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పేటలో ఘనంగా వైయస్ఆర్ వర్ధంతి వేడుకలు



నాయుడుపేట, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: నాయుడుపేటలో వైయస్ఆర్ వర్ధంతి వేడుకలను మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టిసి బస్టాండు వద్ద ఉన్న వైయస్ఆర్ విగ్రహానికి మాజీఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పూలమాలలువేసి నివాళర్పించారు.ఈకార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, మున్సిపాల్టి చేర్మేన్ కటకం దీపిక,ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి,వైసిపి పట్టణ అధ్యక్షుడు కలికి మాదవరెడ్డి, వైసిపి సీనియర్ నాయకుడు కామిరెడ్డి రాజరెడ్డి తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేటలో ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు

నాయుడుపేట,సెప్టెంబర్ 2 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో కూటమి నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో మాజీఎంపి నెలవల సుబ్రమన్యం,జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్,అట్ల కిష్టరావు,జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా నాయకుడు పవన్ కళ్యాణ్: ఎమ్మెల్యే

గూడూరు, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేసే ప్రజా నాయకుడు పవన్ కళ్యాణ్ అని గూడూరు శాసన సభ్యులు పాసీం సునీల్ కుమార్ అన్నారు. జనసేనపార్టీ నాయకులు తీగల చంద్రశేఖర్ రావ్ ఆధ్వర్యంలో మంగళవారం జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా గూడూరు టవర్ క్లాక్ సెంటర్లో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే సునీల్‌కి, జనసేన నాయకులు తీగల చంద్రశేఖర్‌కి ప్రతిఒక్క జనసేన నాయకులు కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సాయికిరణ్, నాగార్జున, మనోజ్, విజయ్, మధు,వంశీ, నవీన్, కుమార్, అనిల్, వసంత్, సాయి, లతీఫ్, గురుబాబు, వేణు, సుభాన్, మురళీ, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

## గణపయ్యకు 'శ్రీశైలం' మల్లన్న పట్టువస్త్రసాల సమర్పణ



కాణిపాకం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం సిద్ధి, బుద్ధి సమేత స్వామి, అమ్మవార్లకు శ్రీశైలం భ్రమరాంభికా సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం తరపున నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. ఈమేరకు శ్రీశైలం దేవస్థానం తరపున ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, అర్చకులు మంగళవారం ఉదయం కాణిపాకం ఆలయం చేరుకుని స్థానిక దేవస్థానం అతిథిగృహం నుండి పట్టువస్త్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో కాణిపాకం, శ్రీశైలం దేవస్థానం ఏఈఓలు హరిదాసు, కాణిపాకం ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు, ధనుంజయ, ధనపాల్, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు బాలాజినాయుడు, చిట్టిబాబు, అర్చకులు,వేదపండితులు పాల్గొన్నారు. అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## కాలువల్లో సిల్టు తీయకుంటే ఎలా! : ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. పంచాయతీరాజ్ అతిథిగృహంలో ఆయన మున్సిపల్ అధికారులతో అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సమీక్షలు మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్,డిఇఇ సంజీవ్‌కుమార్, ఎఇఇలు తేజస్వీని, శ్రీలత ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన సిబ్బంది, చంద్రకాంత్, సురేష్, సోమశేఖర్‌లు హాజరయ్యారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటి పుణ్యక్షేత్రంలో ఉంది, నిధుల కొరతతో తల్లడిల్లుతుంది. బకాయిలు గత ప్రభుత్వ పాలకుల పుణ్యమా? అని పేరుకుపోయాయి. కాబట్టి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి చరవాణిలో మొరబెట్టుకున్నారు. ముఖ్యంగా వర్షాకాలం ముందు ప్రధాన కాలువలతో పాటు వర్షపు నీరు చెరువులకు తరలించే చెంబేడు కాలువలో పేరుకు పోయిన సిల్టును తొలగించాలని అభ్యర్థించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటికి అత్యధిక బకాయిలున్న వారికి ప్రత్యేక నోటీసులు జారి చేయండని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్‌ను ఆదేశించారు. బకాయిల వసూళ్ళకు క్షేత్రస్థాయిలో వెళ్ళాలని సూచించారు. దోమలు పెరగకుండా ముందుజాగ్రత్తలు ఉండాలని ఎంఎల్ఏ సూచించారు.

## గణనాధుని సన్నిధిలో రాష్ట్ర బిసీ వెల్ఫేర్ సెక్రటరీ

కాణిపాకం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: రాష్ట్ర బిసీ వెల్ఫేర్ ఎక్స్ అఫిసియో సెక్రటరీ సత్యనారాయణ మంగళవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

## యస్వీయూ స్థాపనా లక్ష్యాలను నెరవేరుద్దాం : ఉపకులపతి



తిరుపతి విద్య,సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వర్సిటీ 71వ వ్యవస్థాపక దినోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి. మంగళవారం వర్సిటీలో ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, వర్సిటీ ఉద్యోగ బృందంతో కలిసి ప్రాంగణంలోని టంగుటూరి ప్రకాశం పంతులు,నీలం సంజీవరెడ్డి, మహాత్మా గాంధీ,ఆచార్య గోవిందరాజులు, డా బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఏర్పాటు వెనక గల ఎంతోమంది మహనీయుల కలల్ని నెరవేర్చడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని వీసీ ఆచార్య అప్పారావు రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుర్రంకొండ శ్రీధర్,నెల్లూరు సుబ్రహ్మణ్యం,పలువురు ఉద్యోగులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు.

## ఘనంగా వైఎస్సార్ వర్ధంతి



తిరుపతి రవాణా, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే ప్రజారంజక పాలన అందించారని చెప్పారు. ఏఐసీసీ బీసీసెల్ కోఆర్డినేటర్ కంభంపాటి మురళీ కృష్ణ, చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ ఐరాల లోకేష్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేము, అభివృద్ధి కి వైఎస్సార్ ఎంతో పరితపించారని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ పీసీసీ ప్రధాన కార్యదర్శి సుప్రజ, తిరుపతి డిస్ట్రిక్ట్ ఎస్టి విభాగం అధ్యక్షులు జ్యోతీశ్వర నాయక్, తిరుపతి సిటీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, తిరుపతి జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ ఫయాజ్, తిరుపతి సిటీ కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం అధ్యక్షులు సలీముల్ల, తిరుపతి సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గొడుగు చింత గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జనసేనానీ జన్మదిన వేడుకలు



చంద్రగిరి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: డిప్యూటీ సిఎం, జనసేనానీ పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద జనసేన సీనియర్ నాయకుడు తపసి మురళిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర హస్తకళా కార్పొరేషన్ చైర్మన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు తినిపించారు. జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి బీగాల అరుణ, ఐతేపల్లి సాయికృష్ణ, సాయిలక్ష్మణ్, కె.వెంకటమునిి, బాల రాయల్, రాకేష్, చరణ్ రాయల్, బిజెపి నాయకుడు నరేష్ కుమార్ నాయుడు, టిడిపి నాయకులు త్యాగరాజులు, గుండు శంకర్‌లు పాల్గొన్నారు

## నాగపడగలు బహూకరణ



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలకు ఉపయోగించే రాహు,కేతు నాగపడగలను ఇద్దరు దాతలు బంగారు పూతలతో తయారు చేసి మంగళవారం ఆలయ ఇఓ బాపిరెడ్డికి బహూకరించారు. మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్, రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ సారధ్యంలో అందించారు. విజయవాడకు చెందిన పల్లార రాజు రాగిరేకుపై బంగారు తాపటం చేయించిన రూ.1.22లక్షల విలువ కల్గినది అలాగే ద్రాక్షారామంకు చెందిన పూర్ణచంద్రరావు మరో రెండు రాగిరేకులపై బంగారు తాపడం చేయించిన రూ.1.22లక్షల విలువ కల్గిన నాగపడగలను అందించారు.వీటిని మండపేటకు చెందిన ప్రముఖ శిల్పి వాసా శ్రీనివాస్ తయారు చేసినట్లు వివరించారు.

## యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు: ఎమ్మెల్యే



చిత్తూరురూరల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త: చిత్తూరు నియోజకవర్గానికి పేరున్న కంపెనీలు త్వరలో రానున్నాయనీ.. యువతకు స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. మంగళవారం పివికెయన్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ అరవింద్ మిల్స్ త్వరలో ఏర్పాటు కానుందనీ, సుమారు 40,000 మంది ఉపాధి అవకాశాలు లభించనున్నాయనీ, అలాగే చిత్తూరు మీదుగా రెండు ఎక్స్‌ప్రెస్ హైవేలు త్వరలోనే పూర్తికానున్నాయనీ, వీటిని అనుసంధానిస్తూ దుబాయ్‌కి చెందిన లాజిస్టిక్ కంపెనీలు రానున్నాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతి, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు, కార్పొరేటర్ అశోక్, బిజెపి నాయకులు అట్లూరిశ్రీనివాసులులు పాల్గొన్నారు.